క్లుప్తంగా

'బీఆర్‌ఎస్‌ను ఓడించి రాష్ట్రాన్ని కాపాడాలి'



వర్ధన్నపేట : బీఆర్‌ఎస్ పార్టీని చిత్తుగా ఓడించి రాష్ట్రాన్ని దోపిడీ నుంచి కాపాడాలని ఆర్‌ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లం దాస్ కుమార్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కి రాష్ట్రాన్ని అప్పుల్లో కూరుకుపోయేలా లూటీ చేసిందని ధ్వజమెత్తారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు భూపంపిణీ తదితర అన్ని హామీలను విస్మరించిందని మండిపడ్డారు. ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను మానసిక వేదనకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించడాన్ని ప్రజలు బాధ్యతగా భావించాలని కోరారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



దుగ్గొండి : గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పుల్యాల కిషన్ తెలిపారు. మండలంలోని బెల్ట్‌షాపుల నిర్వాహకులకు పోలీస్‌స్టేషన్‌లో ఆయన గురువారం కౌన్సిలింగ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని చెప్పారు. అనంతరం బెల్ట్‌షాపుల నిర్వాహకులను తహసీల్దార్ రవిచంద్రారెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్సై పరమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



పర్వతగిరి : మండలంలోని గోపనపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుడు మహ్మద్ అబ్దుల్ గఫార్ పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయన్ను హెచ్ఎం జంపాల లింగమూర్తి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సభలో ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. అనంతరం హెచ్ఎం లింగమూర్తి మాట్లాడారు. సమాజ నిర్మాణం, అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర నిర్మాణాత్మకమని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన గఫార్ పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పూర్ణచందర్‌రావు, ఉపాధ్యాయులు నాసం శ్రీనివాస్, వాసవి, అబ్దుల్ గఫార్, గోనెల రమేశ్, ఫరీద్, శ్రీధర్, సదానందం, దామోదర్, ప్రణయ్‌కుమార్, కరుణాకర్, ఉపేంద్ర, సరిత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ కన్వీనర్‌గా భిక్షపతి

చెన్నారావుపేట : మండలంలోని లింగాపురం గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ కమిటీ కన్వీనర్‌గా భిక్షపతిని నియమించారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు భిక్షపతికి క్లస్టర్ ఇన్‌చార్జ్ బాల్నె నియామక పత్రాన్ని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం అందజేశారు. కోకన్వీనర్లుగా బొడ్డుపల్లి కుమారస్వామి, నామోజు భాస్కర్, అజ్మీర మోహన్, దుంకదువ్వ రంజిత్‌లను నియమించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, మండల ప్రధాన కార్యదర్శి నమిండ్ల సురేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాజులపాటి ఉమ అశోక్, ఎంపీటీసీ పసునూటి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ చైర్మన్‌కు అభినందన

చెన్నారావుపేట : నేడు నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిళి ముదిరాజ్ అభినందన సభ నిర్వహించనున్నట్టు తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు హంస విజయరామరాజు తెలిపారు. ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు. నర్సంపేటలోని పెద్దమ్మగుడి ప్రాంగణంలో అభినందన సభ ఉంటుందని తెలిపారు. ముదిరాజ్ కులస్తులు హాజరుకావాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన పసుల రాజకొమురయ్య అనారోగ్యంతో మృతి చెందగా గురువారం అతడి అంత్యక్రియల నిర్వహణ కోసం విశ్రాంత ఎస్‌బీఐ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ అందించిన రూ.5 వేల సాయాన్ని బాధిత కుటుంబానికి సోషల్ సర్వీస్ టీమ్ సభ్యులు కర్ణకంటి రామ్మూర్తి, మల్క సత్యనారాయణ, బండారు నరేందర్, బోడకుంట్ల ప్రభాకర్, ఐకేపీ సీసీ కోల శోభ తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ ఔదార్యాన్ని సోషల్ సర్వీస్ టీమ్ సభ్యులు అభినందించారు. పేద కుటుంబానికి ఆర్థికసాయం అందించనందుకు కృతజ్ఞతలు తెలిపారు.



దుగ్గొండి : బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



నర్సంపేట : బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా ముందస్తు బతుకమ్మ

నర్సంపేట, రాయపర్తి, దుగ్గొండి, నల్లబెల్లి, నెక్కొండ, చెన్నారావుపేట, పర్వతగిరి, వర్ధన్నపేట తదితర మండలాల్లో గురువారం ఊరూరా ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు బతుకమ్మలతో సందడి చేశారు. కోలాటాలతో ఉర్రూతలూగించారు.

–సాక్షి నెట్‌వర్క్



చెన్నారావుపేట : ఉప్పరపల్లి హైస్కూల్‌లో..



రాయపర్తిలో..



నల్లబెల్లి : రుద్రగూడెంలోని కేజీబీవీలో..



నెక్కొండ : విద్యోదయ గురుకులంలో..

పూర్వవిద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోండి

● ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

పర్వతగిరి : ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని మండలంలోని కల్లెడ వనితా అచ్యుత పాయ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ జనార్దన్ సూచించారు. ఆ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వడ్లకొండ అశ్విని, గుగులోతు చందూలాల్, ఎ.పూర్ణ రాజేశ్, అడొంద హరీశ్, వై.స్వాతి, జిల్లా శ్రీనాథ్, పున్నం నవీన్, రామావత్ దేవీలాల్, భూక్యా సంపత్, లక్కం సతీశ్‌లను ప్రిన్సిపాల్, అధ్యాపకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జనార్దన్ మాట్లాడారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే లక్ష్యంగా యాజమాన్యం, అధ్యాపకులు పని చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రతిభ చాటి ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. ప్రస్తుత విద్యార్థులు పూర్వవిద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకొని ప్రభుత్వ ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తూనే కళాశాల కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీరామమూర్తి, నాగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగం సాధించిన పూర్వవిద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఆరు గ్యారంటీల అమలు ఖాయం



వర్ధన్నపేట : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ స్కీముల అమలు ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జక్కి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీ స్కీములను ఇంటింటికీ ప్రచారం చేయాలని సూచించారు. డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రతీ బూత్‌లో 15 మంది సభ్యులతో కమిటీ వేయడానికి నిర్ణయించినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగరేయడం తథ్యమన్నారు. కార్యకర్తలు అవిశ్రాంతంగా పని చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నరుకుడు వెంకటయ్య, కుమారస్వామి, గుజ్జ రవీందర్‌రెడ్డి, కర్ర మాలతిరెడ్డి, మల్లెపాక సమ్మయ్య, నల్లతీగల రవీందర్, చాదుముల భాస్కర్, కర్ర శ్రీనివాసరెడ్డి, లచ్చిరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర' పథకాలను వినియోగించుకోవాలి



ప్రచారం చేస్తున్న శ్రీధర్, తదితరులు

రాయపర్తి: కేంద్రం పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రం, కొత్తూరు, పెర్కవేడుతోపాటు తదితర గ్రామాల్లో కేంద్రం పథకాలపై గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం పథకాలను రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేస్తున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, నాయకులు రంగు రాములు, వడ్లకొండ రవి, నరేందర్, నూనె అనిల్, ఎనగందుల శ్రావణ్‌కుమార్, సుమన్ పాల్గొన్నారు.

రేపు రాష్ట్రస్థాయి సమావేశం

నర్సంపేట : రేపు (ఈనెల 14న) హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య, రాష్ట్ర నాయకురాలు గాదె రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను బరిలో నిలపాలనే సంకల్పంతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర సీనియర్, నాయకుడు వెంకట్‌రావు, రామదాసు, మహేష్‌బాబు, బాలకృష్ణ ఆధ్వర్యంలో అభ్యర్థులను ప్రకటించనున్నట్లు వివరించారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'గులాబీ' నియంత్రణతో అధిక దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ రాజన్న

సంగెం: పత్తి పంటలో గులాబీరంగు పురుగును పూర్తిగా నియంత్రిస్తేనే అధిక దిగుబడి ఉంటుందని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాజన్న అన్నారు. గవిచర్లలో పత్తి పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ పత్తిలో పచ్చదోమ, గులాబీరంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరానికి 8 లింగాకర్షక ఎరలు అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలి

● మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



రోడ్ షోలో మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

దామెర : దళితబంధు, బీసీబంధు పథకాలను నియోజకవర్గంలో ఎంతమందికి ఇచ్చారో స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి సవాల్ విసిరారు. మండలంలోని ఊరుగొండలో గురువారం ఇంటింటా ప్రచారం, రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. గృహలక్ష్మి పేరుతో ఇళ్లకు ముగ్గు పోయించి లబ్ధిదారులకు రూపాయి ఇవ్వకుండా చేతులు దులుపుకున్నారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో జిమ్మిక్కులు చేస్తూ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని, ఒకసారి అవకాశమిస్తే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, జిల్లా కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడు గంకిడి బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి ముత్యాల శేఖర్, మండల ఉపాధ్యక్షుడు దాంసాని శ్రీనివాస్‌రెడ్డి, మండల కార్యదర్శి ముత్యాల రాజశేఖర్, దళిత మోర్చ అధ్యక్షుడు చేరాలు, బూత్ అధ్యక్షులు సమ్మిరెడ్డి, పరుశరాం పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

శాయంపేట : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలైన సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రచారాల నిమిత్తం వాల్ రైటింగ్, బ్యానర్లు, పోస్టర్లు అంటించేందుకు జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి పొందాలని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి గురువారం ప్రకటనలో సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం 12 గంటల్లోపు వాల్ రైటింగ్, పోస్టర్లు, బ్యానర్లు తొలగించామని పేర్కొన్నారు. ఇప్పటి నుంచి ప్రచారాలకు జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అనుమతి లేకుండా గోడలపై బ్యానర్లు, పోస్టర్లు అతికించినా, వాల్‌రైటింగ్ కనిపించినా సంబంధిత బాధ్యుడిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'ఔట్‌సోర్సింగ్'లో దళారీ

● రూ.4 లక్షలకు ఉద్యోగం

● ఒకరి తొలగింపు.. మరొకరికి పోస్టింగ్

పర్వతగిరి : ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకంలో దళారీ ఆగడాలకు పాల్పడున్నట్టు తెలుస్తోంది. మండలంలోని జమాల్‌పురంలోని ఆ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో రెండు నెలల క్రితం జాటోత్ పార్వతికి సీనియర్ అసిస్టెంట్ పోస్టును పాలకుర్తికి చెందిన రాజునాయక్ అనే దళారీ రూ.4 లక్షలకు ఒప్పందం చేసుకుని రూ.1.50 లక్షలు తీసుకుని మిగతా రూ.2.50 లక్షలు ఇవ్వడంలో జాప్యం కావడంతో ఆమెను తొలగింపు తాజాగా దివ్య అనే యువతికి పోస్టింగ్ ఇచ్చినట్టు సమాచారం. తాను ఉద్యోగంలో చేరి రెండు నెలలు విధులు నిర్వహించాక మిగతా రూ.2.50 లక్షలు ఇవ్వడంలో జాప్యం కావడంతో తనను తొలగించి దివ్యకు ఉద్యోగాన్ని రాజునాయక్ ఇప్పించారని పార్వతి విలేకరులతో గురువారం వాపోయింది. త్వరలోనే రూ.2.50 లక్షలు ఇస్తామని చెప్పినా వినకుండా అధికారులతో కుమ్మక్కై తనను తొలగించారని పార్వతి ఆరోపించింది. తన తొలగింపుపై విచారణ చేపట్టి దళారీతోపాటు దివ్యకు పోస్టింగ్ ఇచ్చిన డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పార్వతి కోరింది. ఈ విషయమై ప్రిన్సిపాల్ మాధవీలతను వివరణ కోరగా ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు పోస్టింగ్ ఇచ్చినట్టు తెలిపారు. నియామకంలో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన



నల్లబెల్లి : ప్రచారం చేస్తున్న డాక్టర్ పరంజ్యోతి



చెన్నారావుపేట : తిమ్మరాయినిపహాడ్‌లో..

వర్ధన్నపేట : కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ నేత డాక్టర్ జన్ను పరంజ్యోతి స్పష్టం చేశారు. మండలంలోని నల్లబెల్లిలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీ స్కీములను ఇంటింటికీ గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడారు. బీఆర్‌ఎస్ అసమర్థ పాలన సాగిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆరు గ్యారెంటీ స్కీములను ఖచ్చితంగా అమలు చేయడంతోపాటు ఇతర ప్రజాసమస్యల పరిష్కారానికి బాటలు పడతాయని చెప్పారు. కాంగ్రెస్‌ను ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జక్కి శ్రీకాంత్, బిర్రు రాజు, తాటికాయల దిలీప్, బిర్రు చంద్రయ్య, పాలసాని దేవందర్‌రావు, మరిపట్ల వెంకన్న, మరిపట్ల ఏలియా, కవిత, రాధిక, రేణుక తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌లో ఇంటింటికీ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ మాట్లాడారు. ఎమ్మెల్యేగా దొంతి మాధవరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జయరాజ్, క్లస్టర్ బాధ్యులు జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మంచాల సదయ్య, నన్నెబోయిన రమేశ్, సిద్దన రమేశ్, ఎంపీటీసీ రమాబాయి, అమీరొద్దీన్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందని నష్టపరిహారం

ఆత్మకూరు: అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోగా వారికి పరిహారం అందిస్తామని చెప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీని నిలబెట్టుకోలేకపోయిందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జైపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. రైతులు పంటనష్ట పరిహారం కోసం ఎదురుచూసి విసిగిపోయారన్నారు. అదే విధంగా 90శాతం మంది రైతులకు ఇప్పటి వరకూ రుణమాఫీ కాలేదన్నారు. సీఎం కేసీఆర్ చెప్పిన ఉచిత ఎరువులు పంపిణీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకుడు అలువాల రవి పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన గారె కొమురుమల్లు అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత కొమురుమల్లు మృతదేహానికి గోపాల్‌రావు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అనారోగ్యంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఏకేతండాకు చెందిన నరేశ్, మూడు రమేశ్, మైలారానికి చెందిన మామిడాల శంకరయ్యలను గోపాల్‌రావు పరామర్శించి మాట్లాడారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చిన్నాల తారశ్రీ రాజబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మెర వీరస్వామి, వెంకటాచారి, సోమేశ్వర్‌రావు, డైరెక్టర్ కుల్ల వెంకన్న, గారె కిరణ్, మంగిశెట్టి రాజు, అష్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

30 లీటర్ల మద్యం పట్టివేత

ఆత్మకూరు: మండలంలోని అగ్రంపాడ్‌లో బెల్ట్‌షాపులపై దాడులు చేసి రూ.17 వేల విలువైన 38 లీటర్ల మద్యంను ఎస్సై ప్రసాద్ స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రవిరాజు తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వాహకుడు కోమల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఇద్దరికి గాయాలు

ఐనవోలు: ఆగి ఉన్న ఆటోను మరో ఆటో ఢీకొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పున్నేలు క్రాస్ వరంగల్–ఖమ్మం రహదారిపై గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా.. కొడకండ్లకు చెందిన సాయిని ఉపేందర్, సాయిని మల్లేశ్వరి ఆటోలో వరంగల్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న పరంజ్యోతి క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కించేందుకు సాయం చేశారు. ఫిర్యాదు అందలేదని ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

రుణమాఫీ వేదన

సంగెం : సాంకేతిక కారణాలతో రుణమాఫీ అందక అన్నదాతలకు వేదన తప్పడం లేదు. కొందరు రైతన్నలు కన్నీరు మున్నీరౌతున్నారు. గత ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ లక్ష రుణమాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం తొలిసారిగా రూ 25 వేలలోపు, తర్వాత రూ.50 వేల వరకు పంట రుణాలను మాఫీ చేసింది. సుమారు నెల రోజుల క్రితం నుంచి రూ లక్ష వరకు మాఫీ చేస్తుండగా సగం మందికిపైగా బాధిత రైతులకు అమలు కావడం లేదు. దీంతో బాధిత రైతులు వ్యవసాయ శాఖ, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న దుస్థితి నెలకొంది. వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి విచారించగా కొందరికి 'టు బీ ప్రాసెస్డ్' అని, మరికొందరికి 'సేమ్ ఆధార్ నంబర్ ఫర్ డిఫరెంట్ పర్సన్' అని ఉండడంతో ఏం చేయాలో తెలియక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

వందల సంఖ్యలో బాధిత రైతులు

ఆధార్ నంబర్ కరెక్టుగా నమోదైందని బ్యాంకుల్లో అధికారులు, గతంలో పంపిన డాటా ఆధారంగానే రుణమాఫీ అమలౌతోందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతుండడంతో అసలు తప్పెక్కడ జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. అన్ని బ్యాంకుల్లోనూ వందల సంఖ్యలో బాధిత రైతులున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రభుత్వం సమీక్షించాలి

రుణమాఫీ వర్తించని రైతులు మండలం నుంచి భారీ సంఖ్యలో ఉన్నారు. సమస్యకు గల కారణం తెలియడం లేదు. ఒకటికి మించి బ్యాంకుల్లో రుణం తీసుకుని లేదా ఒకే ఆధార్ నంబర్ పలువురికి నమోదు కావడం లాంటి కారణాలుండొచ్చు. రుణమాఫీ వర్తించని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం సమీక్షించాల్సి ఉంది.

-సీహెచ్.యాకయ్య, ఏఓ, సంగెం

కారణం తెలియదట



రుణమాఫీ అందకపోవడం గల కారణం తెలియదని బ్యాంకుల, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నేను 2018లో రూ.70 వేల పంట రుణం తీసుకున్నా. పలువురికి రుణమాఫీ డబ్బులు ఖాతాలో జమ కాగా నాకు రాలేదు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదిస్తే రుణమాఫీ జాబితాలో పేరుండగా 'సేమ్ ఆధార్ నంబర్ ఫర్ డిఫరెంట్ పర్సన్' అని ఉందన్నారు. బ్యాంకుకు వెళితే అధికారులు తమకు తెలియదంటున్నారు.

- కంది కిషన్, రైతు. ఎల్గూర్‌రంగంపేట

రాష్ట్రస్థాయికి ఎంపిక

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో చదువుతున్న 5గురు విద్యార్థులు ఈనెల 4న మహబూబాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ క్రీడల్లో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీలత తెలిపారు. పదో తరగతి చదువుతున్న జంగా అర్చన, 9వ తరగతి చదువుతున్న మోరె సాయిశృతి ఈనెల 13 నుంచి 15 వరకు తొర్రూర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. హెచ్ఎం శ్రీలత, పీఈటీ కరిత, సర్పంచ్ రవి, ఎస్ఎంసీ చైర్మన్ రవీంద్రాచారి విద్యార్థులను అభినందించారు.

'మంద నరేష్‌కు మద్దతు'

శాయంపేట : బీఎస్పీ నుంచి భూపాలపల్లి, పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్‌కు కేటాయిస్తే ఆయనకు మద్దతిస్తామని జిల్లా కన్వీనర్ నాగుల పవన్‌కల్యాణ్ తెలిపారు. కేయూ నుంచి విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న నరేష్‌కు టికెట్ ఇచ్చి అవకాశం కల్పించాలని బీఎస్పీ చీఫ్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కోరారు.